క్లుప్తంగా

ఘనంగా గౌరిదేవి నిమజ్జనం

వేంపల్లి : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన గౌరిదేవి అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఐదురోజుల పాటు ఆలయ అర్చకులు ప్రసాదుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించనున్నారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని పురవీధుల లో ఊరేగింపుతో తీసుకెళ్లి వృశభాచలేశ్వర స్వామికి చెందిన పుష్కరిణివద్ద నిమజ్జనం చేశారు.

రామాలయ శిలా కట్టడం పనులు ప్రారంభం



ఆలయ రాతి కట్టడం పనులను ప్రారంభిస్తున్న పండితులు

ముద్దనూరు : స్థానిక పాతవీధి శ్రీరామాలయ నిర్మాణంలో భాగంగా శనివారం శిలా కట్టడం పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పండితులు శంకరశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి రాతి నిర్మాణ పనులను ప్రారంభించారు. పాత ఆలయ స్థానంలో నూతన శ్రీరామాలయ పునర్నిర్మాణం కోసం గతంలో పనులను ప్రారంభించిన సంగతి విదితమే. పలువురు భక్తులు ఈ శిలా కట్టడం ప్రారంభ పనుల్లో పాల్గొన్నారు.

కళాశాలకు సీసీ కెమెరాలు వితరణ



సీసీ కెమెరాలను అందజేస్తున్నా నారాయణరెడ్డి

వేంపల్లె : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టి నారాయణరెడ్డి సీసీ కెమెరాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌కు సీసీ కెమెరాలను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు పట్ల జాగ్రత్తలు ఎంతో అవసరమన్నారు. అలాగే విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు.

18న దివ్యాంగులకు ఉచిత పరికరాల పంపిణీ

ముద్దనూరు : మండలంలో ఎంపికైన దివ్యాంగులకు ఈనెల 18వ తేదీన జమ్మలమడుగులో ఉచిత పరికరాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. నానుబాల ఎల్లప్ప ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు పంపిణీ చేస్తారని, సంబంధిత అధికారులు దివ్యాంగులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు.

చేతిరాతపై శిక్షణ

తొండూరు : మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం చేతిరాతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ మల్లేశ్వరరెడ్డి విద్యార్థులకు చేతిరాతలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

రాజీయే రాజమార్గం



జడ్జి షైజున్నీసాకు వినతిపత్రం అందజేస్తున్న కుప్పం తాండా వాసులు

చక్రాయపేట : సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీయే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్ షేక్‌షైజున్నీసా తెలిపారు. శనివారం మండలంలోని కుప్పం తాండాలో జరిగిన న్యాయ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలకు న్యాయ సహాయం చేస్తామన్నారు. పౌరులు ఎప్పటికీ చట్టాన్ని ఉల్లంఘించ కూడదన్నారు. అనంతరం కుప్పం తాండా వాసులు తమకు బసు సౌకర్యం కల్పించాలని ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు విజయకుమారి, డిప్యూటీ తహసీల్దారు వీరశేఖర్, ఎస్‌ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33–11 కేవీ సబ్‌స్టేషన్ మెయింటెన్స్ కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. మెయిన్ రోడ్డు, అంబకపల్లె బైపాస్ రోడ్డు, ఎస్బీఐ కాలనీ, కడప రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నల్లపురెడ్డిపల్లె అరటికి విదేశాల్లో గిరాకీ

- ఇరాన్, ఇరాక్ దేశాలకు సరఫరా

పులివెందుల రూరల్ : మండలంలోని యర్రబల్లె పంచాయతీ పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, చంద్రగిరి, నల్లగొండువారిపల్లె గ్రామాలలోని రైతులు అరటి పంటను సాగు చేశారు. ఈ అరటికి ఇరాన్, ఇరాక్ దేశాల్లో డిమాండ్ ఉంది. ఈ అరటి ఇప్పటి వరకు దేశీయంగా ప్రసిద్ధి గాంచింది. జిల్లా వ్యాప్తంగా 40 శాతానికి పైగా అరటి సాగులో ఉంది. సుమారు 20వేల నుంచి 30 వేల మంది రైతులు అరటి పంటలపై ఆదారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం మీద ఆసక్తి ఉన్న రైతులు భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇక్కడ రైతులు సేంద్రియ ఎరువులు, బిందుసేద్యం ద్వారా నీరు అందిస్తుండటంతో మంచి దిగుబడులు ఇస్తున్నాయి.



నల్లపురెడ్డిపల్లెలో సాగులో ఉన్న అరటి తోట



గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఆదాయం బాగు..

ఎకరాలో సుమారు 12 వందలు మొక్కలు నాటుతుండగా 11 నెలలకు దిగుబడులు వస్తున్నాయి. ఒక సారి మొక్కలు నాటితే 3 ఎళ్ల పాటు దిగుబడులు పొందవచ్చు. అరటి పిలకలకు, ఊత కర్రలకు, బిందుసేద్యం పైపులకు రూ.1.50 లక్షల వరకు ఖర్చులు అవుతుందన్నారు. ఇక హెక్టారుకు 65 నుంచి 70 టన్నులు దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో లాబాలు బాగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లాభాలు బాగా వస్తున్నాయి



ప్రస్తుతం అరటికి ఇతర దేశాలలో మంచి డిమాండ్ ఉంది. అందువల్ల నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె గ్రామాలలో పెంచిన అరటిని ఇరాన్, ఇరాక్ దేశాలకు ఎగుమతులు చేస్తున్నాము. యర్రబల్లె పంచాయతీలోని గ్రామాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటే ఆనందంగా ఉంది.

– శివకుమార్, రైతు, నల్లగొండువారిపల్లె

నాణ్యమైన ఎరువులు వాడటం వల్ల



పులివెందుల ప్రాంతంలో రైతులు సాగు చేసిన అరటికి నాణ్యమైన ఎరువులు వాడటం వల్ల మంచి దిగుబడులు వస్తున్నాయి. అలాగే సేంద్రియ ఎరువులు వాడటం వల్ల ఈప్రాంతం అరిటికి ఇతర దేశాలలో గుర్తింపు ఉంది. అలాగే బెంగళూరు, తమిళనాడు, హైదరాబాదు, రాష్ట్రాలకు కూడా ఇక్కడ నుంచి అరటిని సరఫరా చేస్తున్నము.

– రవికుమార్, రైతు, నల్లగొండువారిపల్లె

నేడు క్యాన్సర్ వ్యాధి నిపుణులు రాక

పులివెందుల రూరల్ : హాస్పిటల్ దినేష్ మెడికల్ సెంటర్ కు ఆదివారం ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నిహారిక వస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈసీ గంగిరెడ్డి హాస్పిటల్ లో క్యాన్సర్ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. వివరాలకు 08568 286189, 9963170177 నంబర్లన సంప్రదించాలన్నారు.

పేదల పక్కా ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి

ముద్దనూరు : గత ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు మంజూరుచేసిన పక్కా గృహాల నిర్మాణంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని సీపీఎం నాయకులు ఏసుదాసు సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో నిర్మాణంలో వున్న పక్కా గృహాలను పరిశీలించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి పక్కాగృహాలకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు చెల్లించే మొత్తాన్ని కూడా పెంచాలని, పేదల ఇంటి నిర్మాణం కళలను సాకారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయస్వామి, గ్రామదేవత గంగమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీఎస్ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు పర్యవేక్షణలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో వేద పండిత బృందం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మొదట గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. రక్షాబంధనం అనంతరం యాగశాల ప్రవేశం చేసి వాస్తు మండలారాధన, వాస్తు హోమాలను నిర్వహించారు. ద్వారతోరణ పూజలు నిర్వహించి అఖండ దీప స్థాపన చేశారు. సాయంత్రం పుట్ట వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి మట్టిని తీసుకుని వచ్చి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిష్టకు సిద్ధంగా వున్న గణపతి, శ్రీ దత్తాత్రేయస్వామి, శ్రీ గంగమ్మ తల్లి విగ్రహాలతోపాటు వారి వాహనాలు, ఉత్సవ విగ్రహాలను ధాన్యం నుండి బయటకు తీసి జలాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరెడ్డి, సిద్దారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కళశాలను తీసుకుని వస్తున్న అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి దంపతులు

నేడు మండల సమావేశం

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : ఆదివారం ఉదయం 10.30 గంటలకు చింతకొమ్మదిన్నె మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కుశాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు అందేలా చూడండి

చక్రాయపేట : మండలంలో రెండు నెలలుగా బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు అందడంలేదని టెలికాం జిల్లా డీఎంకు బీజేపీ నేషనల్ కౌన్సిల్ రామచంద్రారెడ్డి వినతిపత్రం అందజేశారు. మండలంలో అనేక మంది ప్రజలు బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగించు కుంటున్నారన్నారు. తక్షణం స్పందించి సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నిధులు దుర్వినియోగం కాకుండా చూడండి

కొండాపురం : మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులు దుర్వినియోగం కాకుండా రికార్డులు సక్రమంగా ఉండాలని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ అధికారులను ఆదేశించారు. శనివారం కొండాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 ఎప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 తేదీ వరకు జరిగిన పనులకు 19వ సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ఓపెన్‌ఫోరంలో వివరించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 245 పనులకు రూ.2,05,24,999 ఖర్చు చేశారు. అలాగే పంచాయతీరాజ్ 86 పనులకు రూ.5,73,02,927 విలువైనా పనులను చేపట్టినట్లు వివరించారు. మండలంలోని గ్రామాల్లో డీఆర్పీ, ఎస్ఆర్పీలు పనుల్లో జరిగిన పొరపాట్లకు సంబంధించి సామాజిక బృందం రూ. 6.71 లక్షలకు రికార్డులు సరిగాలేవని గుర్తించగా వాటిలో రూ.90,641 నగదు రికవరి చేశామన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎపీడీ రామలింగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగప్రసాద్, ఎపీఓ వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

అక్షరాస్యతపై అవగాహన

సింహాద్రిపురం : మండలంలో గ్రామీణబ్యాంక్ వారి సహకారంతో శనివారం అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీడల గ్రామంలోని కస్తూర్బా గాంధీ స్కూల్‌లో బ్యాంక్‌లో ఉన్న రుణాలు, డిజిటల్ లావాదేవీల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పాటలు ద్వారా తెలియజేశారు.

కుల వివక్షపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : మైలవరం మండలంలో ఉన్న గ్రామాలలో కులవివక్ష చూపుతున్నారని డీఎస్పీ వెంకటేశ్వరావుకు శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా దోమల నివారణ

వల్లూరు (చింతకొమ్మదిన్నె): ప్రజల ఆరోగ్యంపై వివిధ రకాల క్రిమి కీటకాలు దాడి చేసి అనారోగ్యం పాలు చేస్తూ వుంటాయని, అందులో కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా వంటి వ్యాధుల కారణంగా తరచూ మరణాలు కూడా సంభవిస్తుంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాక అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు.

మండలంలోని మూలవంక సమీపంలోని నీరు నిల్వ వున్న నీటి కుంటలను శనివారం ఆయన పరిశీలించి అందులో గంబూషియా చేపలను వదిలారు. వ్యాధులను వ్యాపింప చేయడంలో దోమలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. వాటిని వివిధ దశల్లో నియంత్రించడం కోసం ప్రభుత్వం వివిధ పద్ధతులను అవలంభిస్తోందన్నారు. అయితే ఈ విధానంలో క్రిమిసంహారక మందులను ఉపయోగించకుండా దోమల లార్వాలను భుజించి జీవించే గంబూషియా వంటి చేపలను నీటి కుంటలలో వదలడం ద్వారా జీవ నియంత్రణ పద్ధతుల్లో దోమలను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, వైద్యాధికారి రాఘవేంద్ర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కమలాపురం : మండలంలోని సి.గోపులాపురం గ్రామంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకంగా మారింది. గ్రామంలో పంచాయతీ కార్యాలయ సమీపంలో ఒక వైపుకు పూర్తిగా వాలిపోయి పడిపోయే స్థితిలో ఉంది. వర్షాకాలం కావడంతో పడిపోతుందేమోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె గ్రామంలో శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మండల పూజను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప భక్తులు మండల పూజకు తరలివచ్చారు. సాయంత్రం వైభవంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమానికి పులివెందుల ప్రాంతంలోని అయ్యప్పస్వాములు తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు

కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు ఎక్కడ..?

– మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రైతులకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో ఎక్కడ కూడా రైతులకు మేలుచేకూర్చలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులను అన్ని విధాలుగా అదుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అన్నారు. అప్పుడు రైతులకు పంట నష్టపరిహారం అందించామన్నారు. అప్పుడు సచివాలయం నుంచి సిబ్బంది వచ్చి రైతులకు ఉచితంగా బీమా కట్టించారన్నారు. సకాలంలో రైతు భరోసా, పంట బీమాలను అందించామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదన్నారు. పంట బీమా కోసం రైతుల వద్ద నుంచి ఎకరాకు రూ.480లు కట్టించుకుంటుందన్నారు. ఇలా రైతులు కట్టిన డబ్బులే ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం వస్తుందన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి రైతుల వద్ద నుంచే డబ్బులు లాక్కుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం రైతులకు అందాల్సిన రైతు భరోసా, పంట బీమా పరిహారం, పంట నష్టం ఇంకా చెల్లించలేదన్నారు. ఎరువులు, పాస్పేట్, యూరియాలను కూడా పెంచి డబ్బులు తీసుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రైతులకు అండగా నిలిచి అన్ని ఉచితంగా ఇచ్చామన్నారు. ఇప్పుడు రైతులకు ఈ కూటమి ప్రభుత్వం ఏమి మేలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామకృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి

కనుల పండువగా కోటి దీపోత్సవం

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం ఘనంగా జరిగింది. శనివారం రాత్రి ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ దంపతుల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వార్లను మాడ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.



కోటీ దీపోత్సవ కార్యక్రమానికి హాజరైన భక్తులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

కమలాపురం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలకు దూరం కావచ్చని కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం స్థానిక దర్గా వీధిలో వైద్య ఆరోగ్య, నగర పాలన సిబ్బంది పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు మీ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మీ టబ్బుల్లో ఉంచితే నగర పంచాయతీ సిబ్బంది వచ్చి తీసుకెళ్తారన్నారు. చీకటి పడగానే తలుపులు కిటికీలు మూసి వేయాలన్నారు. అలాగే దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. చిన్న జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. ప్రజలు తప్పనిసరిగా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏఎన్ఎంలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



దర్గా వీధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నగర కమిషనర్

సేంద్రియ సాగు.. ఆరోగ్యం బాగు

తొండూరు : సేంద్రియ పద్ధతితో ఆరోగ్యం బాగుంటుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రమణమ్మ తెలిపారు. శనివారం ఇనగనూరు–2 అంగన్‌వాడీ కేంద్రంలో తొమ్మిదిరకాల మొక్కలు నాటి మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. సహజ సస్య రక్షణ పద్ధతిలో శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నిమ్మ, జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి, ఉసిరికాయ, దనియాలు, మునగ, సీతాఫలం, మెరప, చుక్కాకు, ప్రకృతీ వ్యవసాయం ద్వారా నాటడం జరిగిందన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్, స్వామి వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో రాజులకు మాత్రమే పరిమితమైన గ్రంథాలయాలు ఉద్యమ కారుల ఫలితంగా నేడు గ్రామ గ్రామాన వెలసి ఉన్నాయన్నారు. ఉద్యమకారుల జీవిత చరిత్రలను విద్యార్థులకు వారు వివరించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి నాగాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం ప్రసాదు వ్యాసరచన పోటీలు నిర్వహించి మాట్లాడారు. వివిధ పోటీలను వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : మండలంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పాఠశాల విద్యార్థులకు వకృత్వ పోటీలను పాధ్యాయులు కిరణ్‌కుమార్, శ్రీనివాసులరెడ్డిలు నిర్వహించి మాట్లాడారు. వివిధ పోటీలను వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

జమ్మలమడుగులో

జమ్మలమడుగు : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఉద్యమ కారుల చిత్రపటాలకు శనివారం ఆయుర్వేద మెడికల్ అధికారి జి.శ్రీకాంత్ నివాళులు అర్పించి మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమకారుడైన గాడి చర్ల హరిసర్వోత్తమ రావు, గిడుగు రామమూర్తి పంతులు లాంటి విజ్ఞానవేత్తల పోరాటంతో గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయన్నారు.

జమ్మలమడుగు రూరల్ : పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయంలో పుస్తకాలను చదివి పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటాలన్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పల్లా వెంకటకృష్ణయ్యను గ్రంథాలయ అభివృద్ధి అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చంద్రశేఖర్, న్యాయవాదులు సుబ్బారావు, కుందా భాస్కర్, కవి శ్రీనివాస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో

చక్రాయపేట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ఈవో పీఆర్ ఆర్‌డీ విజయకుమార్‌నాయక్ హజరై ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి రాజశేఖర్ పాఠకులు పాల్గొన్నారు.



కమలాపురంలో ఉద్యమ కారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్



జమ్మలమడుగులో ఉద్యమ కారుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న అధికారి



జమ్మలమడుగులో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు